ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 9 మార్చి 2024





రాంబిల్లి మండలం పంచదార్లలో ఉమాధర్మ లింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకస్వామి

హరహర మహాదేవ..

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

- మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తులు



సబ్బవరం మండలం దేవీపురం పంచభూత లింగేశ్వర దక్షవటిలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు శుక్రవారం శివనామస్మరణతో మారుమోగాయి. ఆలయాల్లో తెల్లవారుజామున ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామిని దర్శించుకోవడానికి ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. గొలుగొండ మండలంలో ఉమాధారమల్లేశ్వరస్వామిని సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు దేవదాయ శాఖ అధికారులు వెల్లడించారు. నర్సీపట్నం బలిఘట్టంలోని బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు ఉత్తర వాహినిలో పుణ్య స్నానాలు ఆచరించి, బ్రహ్మలింగేశ్వరస్వామి దర్శించుకున్నారు. రాంబిల్లి మండలం పంచదార్లలో ఉమాధర్మలింగేశ్వర స్వామి ఆలయానికి, రావికమతం మండలం కల్యాణపులోవకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జలాశయంలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఆలయంలో పోతురాజుబాబు, పెద్దింటమ్మను దర్శించుకుని పూజలు చేశారు. 50 వేలమందికిపైగా భక్తులు వచ్చినట్టు దేవదాయ శాఖ అధికారులు చెబుతున్నారు.



రావికమతం మండలం కల్యాణపులోవ జలాశయంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

చేతులు కలిపిన ఉద్దండులు!

దాడి వీరభద్రరావు నివాసానికి కొణతాల రామకృష్ణ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనేది నానుడి. దశాబ్దాల రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి అనకాపల్లి జనసేన అభ్యర్థి, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ శుక్రవారం టీడీపీకి చెందిన మాజీ మంత్రి, సీనియర్ నేత దాడి వీరభద్రరావు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలవడం ఇందుకు నిదర్శనం. సుదీర్ఘకాలంపాటు ఉత్తర, దక్షిణ ధ్రువాలుగా వున్న ఈ ఇద్దరు రాజకీయ ఉద్దండులు చేతులు కలపడంతో అనకాపల్లితో పాటు జిల్లావ్యాప్తంగా రాజకీయ సమీకరణలు మారతాయని భావిస్తున్నారు.

- జిల్లాలో మారనున్న రాజకీయ సమీకరణాలు
- సుదీర్ఘకాలం రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న దాడి, కొణతాల
- ఒకరు తెలుగుదేశం, మరొకరు కాంగ్రెస్..
- 1999 ఎన్నికల్లో తొలిసారి ముఖాముఖి పోటీ
- దాడి వీరభద్రరావు గెలుపు
- 2004 ఎన్నికల్లో మరోసారి తలపడిన దిగ్గజాలు
- ఈసారి కొణతాలను వరించిన విజయం
- 2014లో ఇద్దరూ వైసీపీలో...అయినా ఎవరిదారి వారిదే
- అనంతరం పార్టీ నుంచి బయటకు వచ్చిన నేతలు
- ఇటీవల టీడీపీ గూటికి వీరభద్రరావు, జనసేన పార్టీలో చేరిన రామకృష్ణ...
- వచ్చే ఎన్నికల్లో అనకాపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ

అధ్యాపక వృత్తి నుంచి సుమారు నాలుగు దశాబ్దాల క్రితం తెలుగుదేశం పార్టీలో చేరిక ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన దాడి వీరభద్రరావు 1985లో తొలిసారి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందారు. అప్పట్లో కొణతాల రామకృష్ణ కుటుంబం బెల్లం వ్యాపారంలో ఉండేది. 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దాడి వీరభద్రరావు రెండోసారి పోటీ చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత ద్రోణంరాజు సత్యనారాయణ ప్రోత్సాహంతో కొణతాల రామకృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరి అనకాపల్లి నుంచి లోక్‌సభకు పోటీ చేశారు. వీరభద్రరావు ఎమ్మెల్యేగా, రామకృష్ణ ఎంపీగా గెలుపొందారు. అప్పటి నుంచి రాజకీయ ప్రత్యర్థులుగా కొనసాగుతూ వచ్చారు. తరువాత 1991లో లోక్‌సభకు జరిగిన మధ్యంతర ఎన్నికల్లో కొణతాల రామకృష్ణ మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. మూడేళ్ల తరువాత 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దాడి వీరభద్రరావు మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధించారు. రెండేళ్ల తరువాత 1996లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కొణతాల మూడోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, టీడీపీ అభ్యర్థి అయ్యన్నపాత్రుడు చేతిలో ఓడిపోయారు. లోక్‌సభకు 1998లో మధ్యంతర ఎన్నికలు జరగ్గా...కాంగ్రెస్ తరఫున కొణతాల పోటీ చేయలేదు. ఆయన బదులు గుడివాడ గురునాథరావు పోటీ చేసి ఎంపీగా గెలిచారు. మళ్లీ ఏడాది తిరగకుండా 1999లో లోక్‌సభ మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. కొణతాల రామకృష్ణ ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా అసెంబ్లీకి పోటీ చేశారు. టీడీపీ నుంచి యథావిధిగా దాడి వీరభద్రరావు పోటీ చేశారు. హోరాహోరీగా జరిగిన ఈ పోరులో 3,711 ఓట్ల మెజారిటీతో వీరభద్రరావు గెలిచారు. అప్పటి నుంచి రాజకీయ వైరం మరింత పెరుగుతూ వచ్చింది. మళ్లీ 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి దాడి, కాంగ్రెస్ తరఫున కొణతాల తలపడ్డారు. ఈ ఎన్నికల్లో కొణతాల గెలుపొందగా, దాడి వీరభద్రరావు తొలిసారి ఓటమి



టీడీపీ, జనసేన నాయకులతో కొణతాల రామకృష్ణ, దాడి వీరభద్రరావు

చవిచూశారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కొణతాల వాణిజ్య, న్యాయ, ఎక్సైజ్ శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. తరువాత టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, దాడి వీరభద్రరావుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి, శాసనమండలి పక్షనేత హోదా కల్పించారు. 2009 ఎన్నికల్లో కొణతాల కాంగ్రెస్ నుంచి, వీరభద్రరావు టీడీపీ నుంచి పోటీ చేయగా, కొత్తగా ఏర్పడిన ప్రజారాజ్యం పార్టీ తరఫున గంటా శ్రీనివాసరావు పోటీ చేశారు. త్రిముఖ పోటీ జరిగిన ఈ ఎన్నికల్లో గంటా గెలుపొందారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణం తరువాత ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొణతాల రామకృష్ణ చేరారు. 2014 ఎన్నికల ముందు దాడి వీరభద్రరావు టీడీపీని వీడి వైసీపీలో చేరారు. ఇద్దరు నేతలు ఒకే పార్టీలో ఉన్నప్పటికీ ఎక్కడా ఒకే వేదికను పంచుకున్న దాఖలాలు లేవు. ఆ ఎన్నికల్లో వీరభద్రరావు తనయుడు రత్నాకర్ విశాఖ పశ్చిమ నుంచి, కొణతాల సోదరుడు రఘునాథ్ అనకాపల్లి వైసీపీ అభ్యర్థులుగా పోటీ చేసి ... మిగతా 8వ పేజీలో

కొణతాల విజయం కోసం పనిచేస్తాం

- దాడి వీరభద్రరావు ప్రకటన
- వైసీపీని ఓడించేందుకు టీడీపీ, జనసేన శ్రేణులు కలిసి పనిచేయాలని పిలుపు
- కూటమి గెలుపే లక్ష్యం: కొణతాల



అనకాపల్లి టౌన్, మార్చి 8: అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ శుక్రవారం సంతబయలు ప్రాంతంలో గల మాజీ మంత్రి దాడి వీరభద్రరావు నివాసానికి వెళ్లారు. ఎన్నికల్లో తనకు సహకరించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ తమ రెండు కుటుంబాల మధ్య రాజకీయాలకు ముందు అవినాభావ సంబంధాలు ఉండేవన్నారు. రాజకీయపరమైన విభేదాలే తప్ప వ్యక్తిగత సమస్యలు ఏమీ లేవన్నారు. కొణతాల తండ్రి సుబ్రహ్మణ్యంతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో కొణతాలను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు తామంతా కలిసి పనిచేస్తామని దాడి వీరభద్రరావు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా జగన్‌ను ఓడించడమే లక్ష్యంగా ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో డబ్బుతో గెలుపొందాలని వైసీపీ భావిస్తుందన్నారు. నియోజకవర్గం లేని వ్యక్తి ఉమ్మడి జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని పరోక్షంగా మంత్రి అమర్‌నాథ్‌ను విమర్శించారు. అమర్‌నాథ్‌ను తన గుండెల్లో పెట్టుకుంటానని ముఖ్యమంత్రి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, గతంలో తన కుమారుడు రత్నాకర్‌ను కూడా అదేవిధంగా గుండెల్లో పెట్టుకుంటానన్నారన్నారు. కొణతాల విజయానికి కలిసికట్టుగా పనిచేసి, రాక్షస పాలనను తరిమికొడదామన్నారు.

స్టీరింగ్ కమిటీ ఏర్పాటుచేసుకుందాం: కొణతాల



జనసేన, టీడీపీతో పాటు బీజేపీ కూడా పొత్తులోకి వస్తున్నందున అందరం కలిసి పనిచేస్తామని కొణతాల రామకృష్ణ అన్నారు. దాడి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్తులో ఒక సమావేశం ఏర్పాటుచేసి స్టీరింగ్ కమిటీ నియమించుకుందామన్నారు. ఆ కమిటీ ద్వారా పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కష్టపడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును జైలులో పెట్టడం శోచనీయమన్నారు. చంద్రబాబునాయుడు హయాంలో సుజల స్రవంతి ప్రాజెక్టుకు నిధులు మంజూరుచేసినా వైసీపీ ప్రభుత్వంలో మాత్రం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయమే లక్ష్యంగా పనిచేసి రాష్ట్రంతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో దాడి తనయుడు ప్రభాకర్, కొణతాల సత్యనారాయణ, మళ్ల రాజా, బొడ్డేడ శంకరరావు, బొడ్డపాటి చినరాజారావు, కోటిపల్లి జేజిబాబు, కొణతాల రమణబాబు, కృష్ణఅప్పారావు, పీలా నాగశ్రీను, మళ్ల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులకు ఎదురుచూపులు

అమలుకాని '21 రోజుల్లో నగదు జమ' ప్రకటన

- రెండు నెలలు దాటినా రైతులకు అందని సొమ్ములు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న అన్నదాతలు
- అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని ఆవేదన



పౌరసరఫరాల శాఖకు రైతులు విక్రయించిన ధాన్యం బస్తాలు (ఫైల్ ఫొటో)

బుచ్చెయ్యపేట, మార్చి 8: "ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత 21 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తాం"... ఇది వైసీపీ ప్రభుత్వం గొప్పగా చేసిన ప్రకటన. 21 రోజులు కాదు కదా... రెండు నెలలు దాటినా సొమ్ములు అందలేదని మండలంలో పలు గ్రామాలకు చెందిన వరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో పంట పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాట, ఇచ్చిన హామీని అమలుచేయరని మరోసారి రుజువైందని ఆరోపిస్తున్నారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని ఆర్భాటంగా ప్రకటనలు ఎందుకు చేశారని నిలదీస్తున్నారు. మూడు వారాల్లో అందాల్సిన డబ్బులు 60 రోజులైనా అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి వుంటే అక్కడికక్కడే డబ్బులు అందేవని, ప్రభుత్వం మాటలు నమ్మి ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాది రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) ద్వారా 31 మంది రైతుల నుంచి 121 టన్నులు, గంటికొర్లాం ఆర్బీకే ద్వారా 30 మంది రైతుల నుంచి 68 టన్నులు ... మిగతా 8వ పేజీలో

రెండు నెలలైనా డబ్బులు అందలేదు



ఖరీఫ్‌లో ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాను. పెట్టుబడి కోసం రూ.లక్ష అప్పుగా తెచ్చాను. జనవరి 6వ తేదీన ఏడు టన్నుల ధాన్యాన్ని ఆర్బీకే ద్వారా విక్రయించాను. సుమారు లక్షన్నర రూపాయలు వస్తాయని సిబ్బంది చెప్పారు. 21 రోజుల్లో బ్యాంకు ఖాతాలో నగదు జమవుతుందన్నారు. ధాన్యం విక్రయించి రెండు నెలలు దాటింది. డబ్బులు మాత్రం ఇవ్వలేదు. సంక్షేమ పథకాలకు బటన్లు నొక్కుతూ కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి.. రైతుల నుంచి తీసుకున్న ధాన్యానికి డబ్బులు ఎందుకు చెల్లించడం లేదు? ఎన్నికల నోటిఫికేషన్ వస్తే మా గోడు పట్టించుకునేవారే వుండరు.

- పూడి రామారావు, రైతు, బుచ్చెయ్యపేట.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

పోడు పేరుతో యథేచ్ఛగా వృక్షాలు నరికివేత

- ఎండిన తరువాత నిప్పు పెట్టి దహనం
- దేవరాపల్లి, అనంతగిరి మండలాల సరిహద్దు గ్రామాల్లో అటవీ సంపద కనుమరుగు
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు



బల్లగరువు- దాయర్తి రహదారి పక్కన నరికిన చెట్లు


దేవరాపల్లి, మార్చి 8:

గిరిజన గ్రామాల్లో పోడు వ్యవసాయం పేరుతో పచ్చని చెట్లను యథేచ్ఛగా నరికివేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. దేవరాపల్లి, అనంతగిరి మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో పచ్చని చెట్లపై గొడ్డలి వేటు వేస్తున్నారు. అనంతరం చెట్లు ఎండిపోయిన తరువాత నిప్పు పెట్టి దహనం చేస్తున్నారు. ఇటు అనకాపల్లి, అటు అల్లూరి సీతారామరాజు జిల్లాల సరిహద్దు ప్రాంతం కావడంతో రెండు జిల్లాల అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



పీచు మామిడి వద్ద అటవీ భూముల్లో నరికివేసిన చెట్లు

దేవరాపల్లి నుంచి బల్లగరువు మీదగా దాయర్తి వెళ్లే రహదారిలో పీచు మామిడి వద్ద పదుల ఎకరాల్లో చెట్లను నరికి వేస్తున్నారు. అలాగే పాతవాలాబు రోడ్డును అనుకొని శివ మణి షాపు వెనుక భాగంలో పెద్దపెద్ద చెట్లను భూమికంటా నరికి వేస్తున్నారు. కలప చెట్లను దుంగలుగా మార్చి అనంతగిరి మండలం పినకోట, పెదకోట, జాలాడ, చింతలపూడి మీదుగా విజయనగరం జిల్లా బొద్దాం తదితర ప్రదేశాలకు తరలిస్తున్నారు. కలపకు పనికిరాని చెట్లను నిప్పు పెట్టి కాల్చేస్తున్నారు. అయినా సరే అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా మండల కేంద్రానికే పరిమితం అవుతుండడంతో అడవులు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా దేవరాపల్లి, అనంతగిరి మండలాల సరిహద్దు అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం పేరుతో చెట్లను నరికివేస్తున్న విషయాన్ని అటవీ శాఖ అధికారుల వద్ద ప్రస్తావించగా... ప్రభుత్వం రిజర్వు ఫారెస్టులో కూడా గిరిజనులకు డి.పట్టాలు ఇచ్చిందని, దీంతో వారు చెట్లు నరికివేస్తున్నారని చెప్పారు. అందువల్ల తాము అడ్డుకోలేకపోతున్నామని తెలిపారు.



పెదగంగవరం-జీనబాడు రోడ్డు పక్కన చెట్లను నరికివేసి దహనం చేయడంతో బోడిగా మారిన కొండలు

భట్లపూడిలో గ్రావెల్ దందా

కొండపోరంబోకు భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు

- చుట్టుపక్కల ప్రాంతాల్లోని ప్రైవేటు లేఅవుట్లకు తరలింపు
- భారీగా సొమ్ము చేసుకుంటున్న అధికార పార్టీ నాయకులు
- గ్రామస్థులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)



అనకాపల్లి మండలం భట్లపూడిలో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్‌లోకి లోడింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

జిల్లాలో అనధికార గ్రావెల్ తవ్వకాలకు అడ్డుకట్ట పడడం లేదు. అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ ప్రభుత్వ కొండపోరంబోకు భూముల్లో అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. అధికార పార్టీకి చెందిన కొంతమంది స్థానిక నాయకులు సహకారం అందిస్తుండడంతో గ్రావెల్ అక్రమ తవ్వకాలు అడ్డు అదుపు లేకుండా పోతున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనకాపల్లి మండలం సంపతిపురం పరిధి జగనన్న లేఅవుట్‌లో మెరక పనుల మాటున యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు, రవాణా సాగుతున్నాయి. ఇక్కడ తవ్విన గ్రావెల్‌ను జాతీయ రహదారికి ఆనుకొనివున్న ప్రైవేటు లేఅవుట్‌లకు తరలిస్తున్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కనీసం గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లిన దాఖలాలు లేవు. తాజాగా అనకాపల్లి మండలం భట్లపూడి సర్వే నంబర్-1లోని ప్రభుత్వ కొండపోరంబోకు భూముల్లో గ్రావెల్ తవ్వకాలు సాగుతున్నాయి. గ్రామానికి శివారున మోదకొండమ్మ అమ్మవారి ఆలయానికి సమీపంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అండదండలతో గత వారం రోజులుగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు గుట్టుగా జరుగున్నాయి. ఎక్స్‌కవేటర్‌తో గ్రావెల్ తవ్వి, చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రైవేటు లేఅవుట్‌ల మెరక పనులకు తరలిస్తున్నారు. కొప్పాక రైల్వే వంతెన వద్ద భరీ లేఅవుట్‌కు, అనకాపల్లి పట్టణంలో కొన్ని ప్రైవేటు భవంతుల నిర్మాణ పనులకు ఇక్కడి నుంచే గ్రావెల్ రవాణా అవుతున్నట్టు సమాచారం. వాస్తవానికి గ్రావెల్ తవ్వకాలు జరపాలంటే రెవెన్యూ, గనుల శాఖాధికారుల అనుమతు వుండాలి. వాణిజ్య పన్నుల శాఖకు జీఎస్టీ కింద చదరపు క్యూబిక్ మీటరు గ్రావెల్‌కు రూ.100 వరకు చలానా రూపంలో చెల్లించాలి. నిర్దేశించిన హద్దుల మేరకే తవ్వకాలు జరపాలి. కానీ గ్రామాల్లో కొంతమంది అధికార పార్టీ నాయకులు ఎటువంటి అనుమతులు పొందకుండానే ఇష్టానుసారంగా ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వేస్తున్నారు. దూరాన్నిబట్టి ట్రాక్టరు లోడ్ రూ.1,500 నుంచి రూ.2,000లకు అమ్ముకుంటున్నారు. గ్రావెల్ తవ్వకాలపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని భట్లపూడికి చెందిన పలువురు ఆరోపిస్తున్నారు.

క్రైం... crime news

నర్సీపట్నంలో వివాహిత ఆత్మహత్య

నర్సీపట్నం, మార్చి 8: మునిసిపాలిటీలోని ఒకటో వార్డు పరిధి పీనారి పాలెంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్టు పట్టణ సీఐ కాంతికుమార్ తెలిపారు. గొల్లి పూర్ణచంద్రిక సాయి శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. అయితే ఇందుకు గల కారణాలు తెలియ రాలేదన్నారు. ఈ సంఘటనపై మృతిరాలి తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

సముద్రంలో మునిగి వ్యక్తి మృతి

ఎస్.రాయవరం, మార్చి 8: మండలంలోని రేవుపోలవరం వద్ద సముద్రంలో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందినట్టు శుక్రవారం ఎస్ఐ విభీషణరావు తెలిపారు. రేవుపోలవరం సముద్రతీరం వద్ద ఓ వ్యక్తి మృతి చెందినట్టు అందిన సమాచారం మేరకు పరిశీలించగా.. పాయకరావుపేటకు చెందిన నూకాల మనీష్ (29) గా గుర్తించామన్నారు. మనీష్ శుక్రవారం మధ్యాహ్నం రేవుపోలవరం సముద్రతీరం వద్దకు వచ్చాడన్నారు. వంటిపై బట్టలుతీయకుండా మనీష్ మృతి చెంది ఉండడంపై ప్రమాదవశాత్తు సముద్రంలో కాలు జారి మృతి చెందాడని మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు చెప్పారు. మృతుడు మనీష్‌కి వివాహం కాలేదని, సివిల్ ఇంజనీరింగ్ చేశాడని, పాయకరావుపేటలో కాంట్రాక్టర్ వర్క్ చేస్తుంటాడని ఎస్ఐ తెలిపారు.

బస్టాప్‌లో దివ్యాంగుడు...

అనకాపల్లి టౌన్, మార్చి 8: స్థానిక నెహ్రూచౌక్ బస్టాప్‌లో దివ్యాంగుడు గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. కశింకోట మండలం అడ్డాం గ్రామానికి చెందిన చేకూరి వెంకట సూర్యనారాయణరాజు(40) కాలు పోగొట్టుకున్నాడని, ఆయన అనకాపల్లిలోనే కాలం వెళ్లదీస్తున్నాడన్నారు. అయితే బస్టాప్‌లో అపస్మారక స్థితిలో ఉన్న సూర్యనారాయణరాజును స్థానికులు ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా మృతి చెందినట్టు వైద్యాలయం నుంచి సమాచారం వచ్చిందని ఎస్ఐ తెలిపారు. మృతుడు వద్ద ఉన్న సంచిని పరిశీలించగా.. అందులో వలంటీర్ నంబరు లభించడంతో ఆమె ద్వారా కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకున్నామన్నారు. మృతుడు భార్య కృష్ణవేణి పద్మనాభం మండలం చిన్నాపురంలో ఉన్నట్టు నిర్ధారించుకుని వారికి సమాచారం ఇచ్చామన్నారు. శుక్రవారం వారు ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చారన్నారు. భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ చెప్పారు.

డ్రైవింగ్ చేస్తూ గుండెపోటుతో మరొకరు..


మక్కపాటి బాపారావు (ఫైల్‌ఫొటో)

లంకెలపాలెం, మార్చి 8: కారు డ్రైవింగ్ చేస్తూ గుండెపోటుతో ఒకరు మృతి చెందారు. లంకెలపాలెం కూడలిలో శుక్రవారం సాయంత్రం ఈసంఘటన చోటుచేసుకొంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా జయప్రకాశ్‌నగర్‌కు చెందిన మక్కపాటి బాపారావు (55) పరవాడ మండలం కన్నూరులో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. సబ్బవరం సమీపంలో సీలింగ్ సీట్లు తయారీ పరిశ్రమను నిర్వహిస్తున్నారు. బాపారావు తన ఇంటి నుంచి సాయంత్రం కారులో బయలుదేరాడు. లంకెలపాలెం సిగ్నల్ కూడలికి కూత వేటు దూరంలో వచ్చేసిరికి ఆయన గుండె నొప్పి రావడంతో కారును పక్కకు నిలిపి వేసి డ్రైవింగ్ సీటులోనే కుప్పకూలిపోయాడు. స్థానికులు గుర్తించి పోలీసుల సాయంతో కారు అద్దాలు తీసి చూసేసరికి ఆయన మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాపారావుకు భార్య, పిల్లలు ఉన్నారు. ఈమేరకు పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కశింకోట, మార్చి 8: మండలంలోని మోసయ్యపేటలో గోని సంచితో తరలిస్తున్న పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం మోసయ్యపేటలో సాధారణ తనిఖీలు చేస్తుండగా గ్రామానికి చెందిన దుద్దేటి చినరమణ పోలీసులను చూసి గోనెసంచితో పారిపోతుండగా అనుమానం వచ్చి పట్టుకొని తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని ఆయన తెలిపారు. ఈ మేరకు చినరమణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేష్‌బాబు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి దుర్మరణం


కృష్ణ (ఫైల్ ఫొటో)

చింతపల్లి, మార్చి 8: ప్రకాశం జిల్లా గొండుపాలెం జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతపల్లికి చెందిన ఓ వ్యాపారి దుర్మరణం చెందాడు. కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో అల్పాహార దుకాణం నిర్వహిస్తున్న కంచర్ల కృష్ణ (42) రెండు రోజుల క్రితం కారులో డ్రైవర్ అంకాబత్తుల స్వామితో కలిసి శ్రీశైలం దర్శనానికి వెళ్లాడు. దర్శనం పూర్తి చేసుకుని గురువారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం ఉదయం డ్రైవర్ వెనుక సీటులో కూర్చొని నిద్రపోతుండగా కృష్ణ డ్రైవింగ్ చేస్తున్నాడు. 7 గంటల సమయంలో ప్రకాశం జిల్లా గొండుపాలెం వద్ద ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన కృష్ణ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. డ్రైవర్ స్వామి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యాపారి కృష్ణ మృతికి వర్తకం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగేశ్వరరావు, బేతాళుడు సంతాపం వ్యక్తం చేశారు.

పూర్తిగా మహిళా సిబ్బందితో విశాఖ-భవానీపట్న పాసింజర్



మహిళా సిబ్బందితో వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు

విశాఖపట్నం, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం విశాఖపట్నం నుంచి భవానీపట్న పాసింజర్ రైలును (08504) పూర్తిగా మహిళా సిబ్బందితో నడిపించారు. స్టేషన్ మేనేజర్ ఎ.అరుణశ్రీ నాయకత్వంలో లోకోపైలట్‌గా ఝాన్సీరాణి, కో-పైలట్‌గా సాధనకుమారి, రైలు మేనేజర్‌గా (గార్డు) కె.శ్రీరమ్య విధులు నిర్వహించారు. కాగా ఈ రైలుకు చెందిన అన్ని బోగీల నిర్వహణను డిపోలో మహిళా సిబ్బంది చేపట్టడం విశేషం. ఈ సందర్భంగా వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు మంజుశ్రీ ప్రసాద్ తన కార్యవర్గ సభ్యులతో స్టేషన్‌కు చేరుకుని పాసింజర్‌లో విధులు నిర్వహించిన మహిళా సిబ్బందిని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వాల్తేరు రైల్వే మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు మధుస్మిత సాహు, కవితా గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

కల్యాణపులోవలో కోలాహలం



రిజర్వాయర్ వద్ద భక్తులు (పెద్ద ఫొటో)

తిరునాళ్లకు తరలి వచ్చిన భక్తజనం

- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయం పరిసరాలు
- తొలుత రిజర్వాయర్‌లో పవిత్ర స్నానాలు
- అనంతరం పోతురాజుబాబు, పెద్దింటమ్మలకు పూజలు
- గత ఏడాది కంటే సగానికి తగ్గిన భక్తజనం

రావికమతం, మార్చి 8: ఉత్తరాంధ్రలో పేరెన్నికగన్న వేడుకల్లో ఒకటైన రావికమతం మండలంలోని కల్యాణపులోవ తిరునాళ్లు శుక్రవారం అత్యంత వైభవోపేతంగా జరిగాయి. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగిన ఈ వేడులకు విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా రిజర్వాయర్, ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మార్మోగాయి. రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాలు జనసందోహంతో కనిపించాయి. తొలిరోజు సుమారు లక్ష మంది వరకు భక్తులు వస్తారని దేవదాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కాగా 50 వేల మంది మాత్రమే విచ్చేసినట్టు సదరు అధికారులు అంచనా వేస్తున్నారు. పుణ్యస్నానాల అనంతరం భక్తులు పోతురాజుబాబు,పెద్దింటమ్మను దర్శించుకున్నారు. ఆలయం వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేసినప్పటికీ రాను రాను భక్తుల తాకిడి పెరగడంతో చాలామంది ఎండలో నిలవలేక దర్శనాలకు ఇబ్బందులుపడ్డారు. వైసీపీ నాయకులు కంచిపాటి జగన్నాథరావు, ఎంపీపీ పైల రాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, చీమలపాడు సర్పంచ్ వంజరి గంగరాజు తదితరులతో పాటు అన్ని శాఖల అధికారులు అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. అయితే ఈ కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభం కావడంతో భక్తులు తొక్కిసలాటకు గురయ్యారు. స్నానాలరేవు వద్ద మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. రావికమతం, కొత్తకోట పీహెచ్‌సీల వైద్యాధికారులు దుర్గాప్రసాద్, రజని ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండ పోలీసులు బందో బస్తు నిర్వహించారు. జెడ్.కొత్తపట్నం వద్ద ఆ గ్రామ సర్పంచ్ వితంశెట్టి సురేష్, పాఠశాల పెరెంట్స్ కమిటీ చైర్మన్ గాలి జగదీష్‌ల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. నర్సీపట్నం నుంచి ఆర్టీసీ తొలిరోజు 40 బస్సులను నడిపింది. ఆటోలు , కార్లను ట్రాఫిక్ దృష్ట్యా పోలీసులు దొండపాడ రాజా వద్దే నిలిపివేశారు. భక్తులను ఆర్టీసీ బస్సుల్లో కల్యాణపులోవకు వెళ్లేందుకు అవకాశం కల్పించారు.


ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ (ఇన్‌సెట్‌లో) పోతురాజుబాబును దర్శించుకుంటున్న భక్తులు


దంపతులతో పూజ చేయిస్తున్న పురోహితులు


దర్శనాల కోసం మండుటెండలో క్యూలో ఉన్న భక్తులు

మహిళా హక్కులు కాపాడుకుందాం

- ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల

పాయకరావుపేట, మార్చి 8: పోరాడి సాధించుకున్న మహిళా హక్కులను కాపాడుకుందామని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. శుక్రవారం స్థానిక ఇందిరాకాలనీలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో విమల సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో సగభాగంగా ఉన్నటువంటి మహిళలు ద్వితీయ శ్రేణి పౌరులుగానే చూస్తున్నారని వాపోయారు. మహిళలంతా సంఘటితమై పోరాడి సాధించుకున్న మహిళా హక్కులను, లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో మద్యాన్ని నిషేధిస్తామని పొందుపరచాలని, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికల్లోనే చట్టసభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి బందుల సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సీహెచ్.పరమేశ్వరి, రమణమ్మ, మహిళలు పాల్గొన్నారు.


ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

● బ్యూటిఫుల్ బటర్‌ఫ్లై



సీతాకోక చిలుక.. వర్ణనకు అందని అందం దీని సొంతం. ఆకులపై వాలినా.. గాలిలో విహరిస్తూ అగుపించినా.. నయనానందకరం. ఇటువంటి జీవి కొంగొత్తగా చోడవరం పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల ఓ ఉపాధ్యాయిని ఇంట శుక్రవారం కనిపించింది. మిలటరీ సైనికులు ధరించే దుస్తుల రంగుల్లో ఉన్న దీనిని చూసిన వారంతా మంత్రముగ్ధులయ్యారు. ఈ మనోహరాన్ని కొందరు సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించి తెగ సంబరపడ్డారు. - చోడవరం

అంబేడ్కర్‌ను అవమానపరిచారు

- శిలాఫలకంపై మరణించిన తేదీని తప్పుగా ముద్రించారు
- మునిసిపల్ వైస్ చైర్మన్ రామకృష్ణ, ఎమ్మెల్యే గణేశ్‌పై ఫిర్యాదు
- అట్రాసిటీ కేసు నమోదుకు దళిత నాయకులు డిమాండ్

నర్సీపట్నం, మార్చి 8: శిలాఫలకంపై అంబేడ్కర్ మరణించిన తేదీని తప్పుగా ముద్రించి, అవమాన పరిచిన నర్సీపట్నం మునిసిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, విగ్రహదాత ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చా విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక దళిత నాయకుడు నేతల నాగేశ్వరరావుతో కలిసి గురువారం రాత్రి పట్టణ సీఐ కాంతికుమార్‌కు ఫిర్యాదు చేశారు. గత నెల 24వ తేదీన వేంకటేశ్వరస్వామి గుడి నుంచి పెదబొడ్డేపల్లి సబ్ స్టేషన్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేసిన దేశనాయకుల విగ్రహాలలో అంబేడ్కర్ విగ్రహం శిలాఫలకంపై ఆయన మరణించిన తేదీని తప్పుగా ముద్రించి అవమానపరిచారని ఆరోపించారు. అంబేడ్కర్ 1891 ఏప్రిల్ 14లో జన్మించారని, 1956 డిసెంబరు 6న మరణించారని, అయితే శిలాఫలకంపై 1902లో మరణించినట్టు తప్పుగా ముద్రించి భారత రాజ్యాంగ నిర్మాతను తీవ్రంగా అవమాన పరిచారని వాపోయారు. ఇందుకు సంబంధించి వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, ఎమ్మెల్యే గణేశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.


సీఐకు ఫిర్యాదు చేస్తున్న దళిత నాయకులు

‘విజన్ విశాఖ’ నేతల కోసమేనా?

- సీఎంకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ లేఖ
- ప్రజల సమస్యలపై అవగాహన లేని ప్రైవేటు కన్సల్టెంట్‌తో తయారు చేయించిన డాక్యుమెంటులా ఉందని విమర్శ

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ‘విజన్ విశాఖ’ పేరుతో ప్రకటించిన ప్రణాళిక ప్రజల కోసమా?, ప్రభుత్వాన్ని నడిపే నేతల కోసమా?...అంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ శుక్రవారం సీఎం జగన్‌కు లేఖ రాశారు. ఆ ప్రణాళిక, అందులోని హంగులతో కూడిన అంశాలను పరిశీలిస్తే ప్రజల సమస్యలపై అవగాహన లేని ప్రైవేటు కన్సల్టెంట్‌తో తయారు చేయించిన డాక్యుమెంటులా ఉందని విమర్శించారు. ఆ కన్సల్టెంట్‌కు భారీగానే ముట్టజెప్పి ఉంటారని, దానికి బదులు ఆ నిధులతో విశాఖ ప్రజల అభిప్రాయాలు తీసుకొని, వారి సమస్యల పరిష్కారానికి దీర్ఘకాలిక ప్రణాళిక తయారుచేసి ఉంటే బాగుండేదని పేర్కొన్నారు. విశాఖపట్నం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమైన మూడు అంశాలు (వ్యవసాయం, పాడి పరిశ్రమ, తీర ప్రాంతంలో సంప్రదాయ మత్స్య పరిశ్రమ)పై దృష్టి పెట్టాల్సి ఉందని, వాటిని విస్మరించి విజన్‌లో ఆకాశ హర్మ్యాలు నిర్మించడం విడ్డూరంగా ఉందన్నారు. విశాఖలో ఏడు లక్షల మంది మురికివాడల ప్రజలు ఉన్నారని, వారికి కనీస వసతులు కల్పించాలనే ప్రయత్నం విజన్‌లో ఎక్కడా కనిపించలేదన్నారు. తీర ప్రాంతాన్ని పరిశ్రమలతో కాలుష్యమయం చేస్తున్నారని, మత్స్యకారులకు జీవనోపాధి కరవవుతోందన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ ముసుగులో మత్స్యకారులను నిర్వాసితులను చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ పరిసరాల్లో పాడి పరిశ్రమపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు బతుకుతున్నాయని, వారిని కూడా పట్టించుకోలేదన్నారు. విశాఖను అత్యంత కాలుష్య నగరాల్లో ఒకటిగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గుర్తించిందని, దానికి పరిష్కారం ఏమీ చూపించలేదన్నారు. విశాఖలో ఐకానిక్ భవనాలు నిర్మిస్తే రియల్ ఎస్టేట్ రంగం, భూకబ్జాదారులకు మాత్రమే లాభం కలుగుతుందని, ఆస్తిపన్నులు పెరిగిపోయి సామాన్యులు చితికిపోతారని ఆందోళన వ్యక్తంచేశారు. విశాఖ ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా, ప్రకృతి వనరులను నాశనం చేస్తూ, అధికార పార్టీ నేతలకు మేలు చేసేలా రూపొందించిన ప్రణాళికను అమలు చేయడం తగదని సూచించారు.

సమస్యలపై మహిళల డోలీమోతతో నిరసన

రోలుగుంట, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని పెదగరువులో ఆదివాసీ మహిళలు డోలీ మోతతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏళ్లు గడుస్తున్నా తమ గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక వసతులు కరువయ్యాయని వాపోయారు. అత్యవసర వైద్య సేవలు అందాలన్నా డోలీమోత ద్వారా ఆస్పత్రికి తీసుకు వెళ్లాల్సిన దౌర్భాగ్య స్థితిని ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. కనీసం రోడ్డు సౌకర్యం లేదని, తాగునీటికి సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పిల్లలు చదువుకోవడానికి పాఠశాల లేకపోవడం విచిత్రకరమన్నారు. ఎన్నికల సమయాల్లో నాయకులు వచ్చి ఓట్ల కోసం హామీలు ఇవ్వడమే తప్పితే కార్యరూపం దాల్చడం లేదన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను గుర్తించాల్సిందిగా కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో కిల్లో నరసమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


డోలీమోతతో నిరసన తెలుపుతున్న ఆదివాసీ మహిళలు

నకిలీ పోలీస్ దందా

- రైల్వేలో ఉద్యోగాల పేరిట రూ.కోట్లు వసూలు
- నకిలీ నియామక పత్రాలు అందజేత
- మోసపోయామని గుర్తించి పోలీస్ కమిషనర్‌ను కలిసిన బాధితులు
- నిందుతుడిని, అతడికి సహకరించిన యువతిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న నగర టాస్క్‌ఫోర్స్

పెందుర్తి, మార్చి 8: రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కోట్ల రూపాయలు వసూలుచేసిన నకిలీ ఎస్ఐను, అతడి స్నేహితురాలిని నగర పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారానికి సంబంధించి బాధితులు, పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం శేఖరపురం గ్రామానికి చెందిన హనుమంతు రమేశ్‌కుమార్ (39), అదే ప్రాంతానికి చెందిన సరితకు 2012లో వివాహం అయ్యింది. వీరికి పాప, బాబు ఉన్నారు. తాను సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్టు రమేశ్‌కుమార్ చెప్పాడు. వరంగల్‌లో పోస్టింగ్ అని చెప్పి శ్రీకాకుళం జిల్లా పలాస మండలం కాశీబుగ్గలో కాపురం పెట్టాడు. ఆరు నెలలకు ఓసారి ఇంటికి వచ్చి కొద్దిరోజులు ఉండి వెళుతుండేవాడు. ఈ క్రమంలో తనకు మణిపూర్, జమ్మూ కశ్మీర్...ఇలా పలు ప్రాంతాలకు బదిలీ అయ్యిందని భార్య సరితకు చెబుతుండేవాడు. పిల్లల చదువుల కోసం సరిత కాశీబుగ్గ నుంచి రెండు సంవత్సరాల క్రితం పెందుర్తి సమీపంలోని దుర్గానగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకుంది.


పోలీస్ డ్రెస్‌లో ఉన్న రమేశ్‌కుమార్


రమేశ్‌కుమార్ స్నేహితురాలు శ్రావణి

టూ టౌన్ ఎస్ఐనంటూ..

పెందుర్తి రాకపోకలు సాగించే క్రమంలో స్థానికులతో రమేశ్‌కుమార్ పరిచయం పెంచుకున్నాడు. విశాఖలో టూ టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్నానని, డిపార్టుమెంట్‌లో ఉన్నత వ్యక్తులతో తనకు పరిచయం ఉందని చెప్పేవాడు. పోలీసు యూనిఫామ్‌తో తిరుగుతుండడంతో స్థానికులు నిజమేననుకున్నారు. అతని ఇంటి ఎదురుగా పెయింటింగ్ పనులు చేసే దుంపల కృష్ణారావు ఉంటున్నారు. కృష్ణారావు కుమారుడికి పోలీసు శాఖలో ఉద్యోగం వేయిస్తానని రమేశ్‌కుమార్ నమ్మబలికాడు. ఆ తరువాత తన భార్య సరిత మేనమామ సికింద్రాబాద్ రైల్వేలో డీఆర్ఎంగా పనిచేసి రిటైర్ అవుతున్నారని రైల్వేలో ఉద్యోగాలు సెట్ చేసుకోవచ్చునని చెప్పాడు. పోలీసు ఉద్యోగాల్లో లా అండ్ ఆర్డర్ సమస్య ఉందని రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. రూ.8 లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. ఇది నిజమేనని నమ్మి దుంపల కృష్ణారావుతో పాటు అతని బంధువులు మరో 12 మంది దఫదఫాలుగా సుమారు రూ.కోటి దాకా ముట్టజెప్పారు.

ఫేక్ మెయిల్స్

రైల్వేలో ఉద్యోగాలు కోసం ఎంపికయ్యారని నకిలీ పత్రాలు, ఫేక్ మెయిల్స్ పంపాడు. అయితే ఎంతకీ ఉద్యోగాలు రాకపోవడంతో అనుమానం వచ్చి నిలదీయడంతో రైల్వే ఉద్యోగ నియామక పరీక్ష ఉందని అందరినీ విజయవాడ రమ్మన్నాడు. అక్కడ గల ఓ లాడ్జిలో శ్రావణి అనే యువతిని పరిచయం చేసి ఆమె రైల్వే డీఆర్ఎం పీఏ అని చెప్పాడు. లాడ్జిలోనే పరీక్ష కండక్ట్ చేశారు. అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చేశాడు. కొన్ని నెలలు తరవాత సికింద్రాబాద్‌లో చేరాల్సి ఉంటుందని చెప్పి..ఆ 12 మంది దగ్గర మిగిలిన మొత్తాన్ని వసూలుచేశాడు. అనంతరం వారందరినీ ఓరోజు సికింద్రాబాద్ రమ్మని అక్కడ గల ఓ హోటల్‌లో ఉంచాడు. హోటల్‌లో ఉంటూ అతనికి ఫోన్ చేస్తే ఏవేవో సాకులు చెబుతూ తప్పించుకునేవాడు. దీంతో వారంతా అనుమానం వచ్చి సికింద్రాబాద్ రైల్వే డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లి ఆ అపాయింట్‌మెంట్ పత్రాలు చూపించగా నకిలీవని తేల్చారు. దీంతో తాము మోసపోయామని గ్రహించారు. ఇదే సమయంలో అనకాపల్లి జిల్లా దేవరాపల్లికి చెందిన కొంతమంది పెందుర్తిలో గల రమేశ్‌కుమార్ ఇంటికి రావడాన్ని బాధితుడు కృష్ణారావు గమనించాడు. అందరూ కలసి రమేశ్‌కుమార్ స్వగ్రామానికి వెళ్లి అతని తల్లిదండ్రులను కలిసి నిలదీయగా అతను ఎస్ఐ కాదని తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న రమేశ్‌కుమార్, శ్రావణి ఒకరోజు పోలీస్ యూనిఫారంలో కృష్ణారావు ఇంటికి వెళ్లారు. అతడి తల దగ్గర తుపాకీ పెట్టి చంపేస్తానని బెదిరించి, జేబులోని రూ.10 వేలు తీసుకుని పరారయ్యారు. బాధితుల్లో కొంతమంది సీపీని ఆశ్రయించడంతో టాస్క్‌ఫోర్సు బృందాలు హైదరాబాద్‌లో రమేశ్‌కుమార్‌ను, శ్రావణిని అదుపులోకి తీసుకున్నాయి. వారి నుంచి మరిన్ని వివరాలు సేకరించేందుకు రహస్య ప్రదేశంలో విచారణ చేస్తున్నట్టు తెలిసింది. అయితే బాధితుడు కృష్ణారావు ఫిర్యాదు మేరకు రమేశ్‌కుమార్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని సీఐ ఎల్.రామకృష్ణ చెప్పారు. రమేశ్‌కుమార్, శ్రావణి నకిలీ పోలీసుల అవతారంలో పోలీసు ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ.3 కోట్లు వరకూ వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఇదిలావుండగా తన భర్త రమేశ్‌కుమార్ కనిపించడం లేదని సరిత జనవరి ఒకటో తేదీన పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిసెంబర్ 31న అర్ధరాత్రి స్పెషల్ టీం డ్యూటీకని వెళ్లి ఇంటికి రాలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

శివ నామస్మరణతో హోరెత్తిన ఆలయాలు


కశింకోట: జోగారావుపేటలో పాలాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద


కొత్తూరు : వెంకుపాలెంలో శివుడికి పూజ చేస్తున్న కొణతాల రామకృష్ణ


అనకాపల్లి టౌన్: శివాలయంలో పాలాభిషేకం చేస్తున్న భక్తురాలు

అనకాపల్లి టౌన్, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని శివాలయాలు శుక్రవారం శివనామస్మరణతో హోరెత్తాయి. కాశీవిశ్వేశ్వర, భోగలింగేశ్వర, సిద్ధిలింగేశ్వర, ఉమారామలింగేశ్వర ఆలయాలతోపాటు కూరగాయల మార్కెట్ వద్ద గల శివాలయం, నిదానందొడ్డిలోని కామాక్షిదేవి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పంచామృతాభిషేకాలు చేపట్టారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో ఆలయాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జాగరాల్లో భాగంగా రాత్రి పట్టణంలోని అన్ని శివాలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే తెల్లవార్లు ఆలయాలు తిరిగిన తరువాత వారి వీధుల్లో సరదాగా గడిపారు. అలాగే గవరపాలెం సతకంపట్టులోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి పూలతో అలంకరించారు. ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొత్తూరు/కశింకోటలో.. మహాశివరాత్రిని పురస్కరించుకొని పలు శివాలయాల్లో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పూజలు చేశారు. పిసినికాడలో స్వయంభూ శివలింగాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జోగారావుపేట, సోమవరం, సింగవరం గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు చేశారు. అలాగే వెంకుపాలెంలో వెలసిన లక్ష్మణమ్మ పేరంటాలును మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేతలు గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, జెర్రిపోతుల నూకునాయుడు, నైనంశెట్టి రమణారావు, ఎస్‌కె బాబర్ పాల్గొన్నారు. వెంకుపాలెం, కశింకోట కస్పావీధి శివాలయాల్లో జనసేన-టీడీపీ అనకాపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మణమ్మ పేరంటాలును దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల నిర్వాహకులు కొణతాల రామకృష్ణకు స్వాగతం పలికి సత్కరించారు.

రాంబిల్లిలో.. మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తుల శివ నామ స్మరణతో మార్మోగాయి. ప్రాచీన శైవక్షేత్రమైన పంచదార్లకు జిల్లా నలుమూలల నుంచి వేలాది భక్తులు తరలివచ్చారు. తొలుత ఆకాశగంగ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం ఫణిగిరిపై వెలసిన ఉమాధర్మలింగేశ్వరస్వామిని దర్శించారు. అనంతరం భక్తులు కాశీవిశ్వేశ్వరస్వామిని, సహస్ర లింగేశ్వరస్వామిని, రాధామాధవస్వామిని భక్తులు దర్శించి, పూజలు చేశారు. గోకివాడలోని కొండల్లో వెలసిన శివలింగాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించి పూజలు చేశారు. దిమిలి, వెలుచూరు, కొత్తపేట, లాలంకోడూరు, కట్టుబోలు, కొత్తపట్నంల్లోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. పంచదార్లలోని ఫణిగిరిపై కొలువై ఉన్న కల్యాణ ద్విముఖ వినాయకుడు భక్తుల పూజలందుకున్నారు.

ఎలమంచిలిలో.. పట్టణంలోని ఆలయాలన్నీ శివ నామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం తెల్లవారు నుంచి పట్టణంలోని త్రిమూర్తులు స్వామి, కొత్తపేట రామలింగేశ్వర స్వామి, బైపాస్ రోడ్డులోని సోమస్కంద స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఏటికొప్పాక కాశీవిశ్వేశ్వరస్వామి, సోమలింగపాలెం, పెదపల్లి, జంపపాలెం, పీఎస్‌ఆర్‌పేట శివాలయాలకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం ఆలయాల్లో జాగారం చేశారు.

సబ్బవరంలో.. మండలంలోని దేవీపురంలోని పంచభూత లింగేశ్వర దక్షవటి, గొర్లివానిపాలెంలో ఉమారామలింగేశ్వరాలయం, పెదయాతపాలెంలో గౌరీపరమేశ్వర్ల సహిత ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, లింగలతిరుగుడులోని సోమలింగేశ్వరాలయం, గణపతిపురంలోని గణపతి భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయం, వంగలి సోమలింగేశ్వరాలయం, ఇరువాడ భీమలింగేశ్వరాలయాల్లో భక్తులు పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్న సమారాధనలు నిర్వహించారు. లింగాలతిరుగుడు సోమలింగేశ్వరాలయంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రత్యేక పూజలు చేశారు.

నక్కపల్లిలో.. మండలంలోని ఉపమాక, గొడిచెర్ల శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు దర్శనాలకు బారులు తీరారు. చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని ధర్మవరం


అనకాపల్లి టౌన్: పూల అలంకరణలో కనకదుర్గమ్మ

అగ్రహారం, ఎస్.రాయవరం, గెడ్డపాలెంల్లోని శివాలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. ధర్మవరం అగ్రహారంలో మహాశివరాత్రి వేడుకలను టీడీపీ నేత సుంకర శ్రీనివాసరావు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ ఆలయ ఆవరణంలో ఇసు గెడ్డతో శివలింగం, పార్వతిదేవి రూపాలను తయారుచేసి ప్రదర్శించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

పరవాడలో.. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం తాడి ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. తాడి, పరవాడ శివాలయాల్లో కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి నీలబాబు దంపతులు పూజలు చేశారు. అలాగే దీపాంజలినగర్, స్వయంభూవరం, లేమర్తి, భరిణికం, దేశపాత్రునిపాలెంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని గోపాలపట్నం సీతమ్మవారి కొండ, పెద్దిపాలెం, నామవరం, సత్యవరం, రాజగోపాలపురం, పెంటకోట గ్రామాలలోని శివాలయాలకు తెలవారుజాము నుంచే భక్తులు స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సీతమ్మవారి కొండపై వెలిసిన ఉమాధర్మలింగేశ్వర స్వామిని విశాఖపట్నం డిప్యూటీ మేయరు జియ్యాని శ్రీధర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ చిక్కాల రామారావు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పాయకరావుపేటలో.. పాయకరావుపేటలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని లింగాలతోట కాలనీ, రాజుగారిబీడు, బృందావనం, క్రత్రాళ్ళకొండ, వద్ద గల శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పాండురంగస్వామి ఆలయం, మంగవరంరోడ్డులోని సీతారామాలయం, బృందావనం దుర్గాలమ్మచెట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి తెల్లవార్లూ రుద్రాభిషేకాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో శివాలయాలు ఆధ్యాత్మిక శోభతో సందడిగా మారాయి.

అచ్యుతాపురంలో.. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం మండలంలో సెజ్‌పునరావాస కాలనీ (దిబ్బపాలెం), నునపర్తి, దోసూరు, అచ్యుతాపురం, కొండకర్ల, పెదపాడు, వడుతూరు, ఎంజేపురంలలో శివాలయాలకు భక్తులు పోటెత్తారు.ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కోటవురట్లలో.. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని జల్లూరు, పందురు, పాములపాక ఆలయాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జల్లూరు ఆలయం వద్ద భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.


నక్కపల్లి: ఉపమాకలో బారులు తీరిన భక్తులు


అనకాపల్లి భోగలింగేశ్వరుని ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు


పరవాడ మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


జడ్పీ మహిళా శిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఈర్లె అనురాధను సత్కరించిన ఎంపీ, ఐసీడీఎస్ అధికారులు

అనకాపల్లి టౌన్, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవాం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్నయిదేవి మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధానికి అందరూ సహకరించాలన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఎంపీతోపాటు వేదికపై ఉన్న వారందరినీ సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ బీవీ సత్యవతి, జడ్పీ మహిళా శిశుసంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ ఈర్లె అనురాధ, ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మి, కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, న్యాయవాది కుసుమ, ఏఎస్ఐ మణికుమారి, ఐసీడీఎస్ పీవో అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పీటీడీ డీపీటీవో కార్యాలయంలో అనకాపల్లి, నర్సీపట్నం డిపోల్లో అంకితభావంతో విధులు నిర్వహించిన మహిళా ఉద్యోగినులను డీపీటీవో కె. పద్మావతి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎస్. సుజాత తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సబ్ జైలులో కూడా మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. మహిళా ఖైదీలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలకు ప్రశంసాపత్రాలు, మహాత్మాగాంధీ స్ఫూర్తి పుస్తకాలను సబ్ జైలు సూపరింటెండెంట్ వై.గణేష్‌రెడ్డి అందజేశారు. అలాగే వైసీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీ బీవీ సత్యవతితోపాటు వైసీపీ కార్పొరేటర్లు, గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులను వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దంపతులు సత్కరించారు.

కొత్తూరులో.. స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో అనకాపల్లి ట్రైనీ డీఎస్పీ భవ్యారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పి.అనురాధ పాల్గొన్నారు.

తుమ్మపాలలో.. మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడబిడ్డల కలలు నెరవేర్చడానికే టీడీపీ -జనసేన మేనిఫెస్టోలో 'కలలకు రెక్కలు' పథకాన్ని చేర్చడం జరిగిందన్నారు. టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే ఆడబిడ్డల ఉన్నత విద్యకు రుణాలందించడంతోపాటు వడ్డీలను ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఆడబిడ్డల తల్లిదండ్రులందరూ సెల్ నంబరు 9261292612కు కాల్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. అనంతరం కేకు కట్ చేసి మహిళామణులకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. గవరపాలెం శ్మశానవాటికలో విధులు నిర్వహిస్తున్న మహిళా కాటికాపరి తట్టా జయలక్ష్మిని సత్కరించారు..

ఎలమంచిలిలో.. పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ పారిశుధ్య మహిళా కార్మికులకు మునిసిపల్ కమిషనర్ కొండలరావు, వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు శంకరగిరి, టీఎస్.బంగారుశెట్టి, కట్టా బాబ్జి పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం పాయకరావుపేటలో ఘనంగా జరిగింది. స్థానిక హైమా నేత్రాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 30 మంది మహిళా పారిశుధ్య కార్మికులను సీఐ పి.అప్పలరాజు, ఆసుపత్రి అధినేత డాక్టర్ పీఎస్‌ఆర్.ప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అడపా ప్రకాష్, సత్తిబాబు, హైమా నేత్రాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడలో.. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వాసవీ, వనితా క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఎంపీపీని వాసవి, వనితాక్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ మాజీ అధ్యక్షుడు భమిడిశెట్టి బంగారుబాబు, అధ్యక్షురాలు పద్మావతి, క్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మునగపాక (తుమ్మపాల).. టీడీపీ-జనసేన మేనిఫెస్టోలో పొందుపరిచిన 'కలలకు రెక్కలు' పథకంతో మహిళలకు బహుళ ప్రయోజనాలున్నాయని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు పేర్కొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆడబిడ్డల విద్యకు సంబంధించి కుటుంబం ఇబ్బందులు ఎదుర్కోకుండా ఈ పథకాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.రమణమ్మ, అనురాధ, మాలతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అడ్డరోడ్డు తిమ్మాపురం క్యాంపు కార్యాలయంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి, జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, ప్రజాప్రతినిధులను వైసీపీ నియోజవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు సత్కరించారు. అంతకముందు ప్రజాప్రతినిధులంతా కేక్ కట్ చేసి పంచారు. అలాగే తిమ్మాపురం కేజీబీవీలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, కార్యదర్శి శ్రీనివాసరావు, సమన్వయకర్త సత్యనారాయణ, మహిళా ప్రధాన కార్యదర్శి పద్మావతి, కేజీబీవీ ఇన్‌చార్జి లక్ష్మి పాల్గొన్నారు.


అనకాపల్లి టౌన్: పీటీడీ మహిళా ఉద్యోగినిలను సత్కరించిన డీపీటీవో పద్మావతి


మునగపాకలో జరిగిన మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు


పరవాడ ఎంపీపీ వెంకటపద్మలక్ష్మిని సన్మానిస్తున్న వాసవీ, వనితాక్లబ్ ప్రతినిధులు


ఎలమంచిలి పారిశుధ్య కార్మికులకు చీరలు అందజేస్తున్న మునిసిపల్ వైస్ ఛైర్మన్‌లు, కమిషనర్

దుర్గాభవానీ పీఠాన్ని దర్శించుకున్న ప్రముఖ రచయిత్రి గీతిక

నక్కపల్లి, మార్చి 8: పశ్చిమగోదావరి జిల్లా పోడూరుకు చెందిన ప్రముఖ రచయిత్రి బి.గీతిక కుటుంబంతో కలిసి ఉపమాక దుర్గాభవానీ పీఠాన్ని దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ పూజ, త్రినేత్రుడికి అభిషేకం చేశారు. గురుభవానీ రాంబాబు,లక్ష్మి దంపతులు రచయిత్రి గీతికను సత్కరించారు.

చేతులు కలిపిన ఉద్దండులు!

... 5వ పేజీ తరువాయి

ఓటమిపాలయ్యారు. కొంతకాలం తరువాత వైసీపీ అధినేత తీరు నచ్చక ఇద్దరూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. టీడీపీలో చేరాలని భావించినప్పటికీ అనివార్య కారణాల వల్ల చేరలేదని రాజకీయ వర్గాల సమాచారం. దాదాపు నాలుగేళ్లపాటు రాజకీయంగా స్తబ్దుగా వున్నారు. గత ఎన్నికల ముందు దాడి వీరభద్రరావు మళ్లీ వైసీపీలో చేరారు. కొణతాల రామకృష్ణ తటస్థంగానే ఉన్నారు. అయితే అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ఆడారి ఆనందకుమార్‌తోపాటు టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా కొన్నిచోట్ల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ దాడి వీరభద్రరావు కుటుంబానికి తగిన న్యాయం జరగలేదు. దీంతో ఇటీవల తన కుమారులు రత్నాకర్, జయవీర్‌లతో కలిసి దాడి వీరభద్రరావు టీడీపీలో చేరారు. ఇది జరిగిన కొద్ది రోజులకే కొణతాల రామకృష్ణ జనసేన పార్టీలో చేరారు. తరువాత టీడీపీ-జనసేన కూటమి పొత్తులో భాగంగా అనకాపల్లి సీటును జనసేనకు కేటాయించడంతో, కొణతాల రామకృష్ణను అభ్యర్థిగా ప్రకటించడం ఒకేసారి జరిగిపోయాయి. దీంతో దశాబ్దాల కాలంగా వున్న రాజకీయ వైరాన్ని పక్కన పెట్టి కొణతాల రామకృష్ణ శుక్రవారం దాడి వీరభద్రరావు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. సుదీర్ఘ కాలంపాటు రాజకీయ ప్రత్యర్థులుగా వున్న ఇద్దరు ఉద్దండులు చేతులు కలపడంతో వచ్చే ఎన్నికల్లో అనకాపల్లితోపాటు పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణాలు మారతాయని విశ్లేషకులు అంటున్నారు.

ప్రమాదకరంగా తాండవ వంతెన రక్షణ గోడ

పాయకరావుపేట, మార్చి 8 : పాయకరావుపేటలోని తాండవ వంతెనపై ఒకవైపు రక్షణ గోడ ఎత్తు తక్కువగా ఉండి ప్రమాదకరంగా తయారైంది. ఈ వంతెన పైనుంచి తుని పట్టణానికి ప్రజలు, వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రద్దీగా ఉంటుంది. సుమారు 200 మీటర్ల పొడవు ఉన్న ఈ వంతెన నిర్మాణ సమయంలో రక్షణకు ఇరువైపులా ఐరన్ రైలింగ్ ఏర్పాటుచేశారు. తుని రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ వంతెనపై ఇనుప రైలింగ్ కొంత కాలానికి తుప్పుపడుతుండడంతో ఆ ప్రదేశంలో ఇటుకలతో రక్షణ గోడ కడుతున్నారు. ప్రస్తుతానికి 90 శాతంపైగా ఇనుప రైలింగ్ కూలిపోగా ఆ స్థానంలో ఇటుకలతో రక్షణ గోడ నిర్మించారు. అయితే పాయకరావుపేట వైపు 20 మీటర్ల మేర ఇనుప రైలింగ్ కూలిపోగా రెండు పట్టణాలకు చెందిన టెలికం, ఇతర నెట్ వర్కుల వైర్ల రన్నింగ్ కోసం ఏర్పాటుచేసిన పైపులైన్ దెబ్బతినకుండా నిర్మించిన చిన్న పిట్టగోడ మాత్రమే ఉంది. ఇది ఎత్తు తక్కువగా ఉండడం వలన పాదచారులు ఏమాత్రం ఆదమరిచినా వంతెన పైనుంచి 20 అడుగుల లోతులో ఉన్న నదిలోకి పడిపోయే ప్రమాదం ఉంది. కొద్ది రోజుల క్రితం మద్యం మైకంలో ఉన్న రిక్షా కార్మికుడు ఈ పిట్టగోడ నుంచి ప్రమాదవశాత్తూ కిందికి పడిపోయి మృతిచెంది ఉంటాడని పలువురు అనుమానిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాండవ వంతెనపై ఇరువైపులా ఎత్తుగా రక్షణ గోడ నిర్మించాలని పాయకరావుపేట పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ధాన్యం డబ్బులకు ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

, పొట్టిదొరపాలెం ఆర్‌బీకే నుంచి 41 టన్నులు... మొత్తం 91 మంది రైతుల నుంచి 230 టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు చేశారు. వీటిని సంబంధిత రైస్ మిల్లులకు సరఫరా చేశారు. వీరిలో ఎక్కువ మంది రైతులు జనవరిలోనే ధాన్యం విక్రయించారు. మూడు వారాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పిన అధికారులు.. రెండు నెలలు దాటినా పట్టించుకోవడంలేదు. ఈ మూడు ఆర్‌బీకేల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు సుమారు రూ.50 లక్షలు అందాల్సి వుందని చెబుతున్నారు. ధాన్యం డబ్బుల కోసం ఆర్‌బీకేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని రైతులు వాపోతున్నారు. ఆన్‌లైన్ పనులన్నీ పూర్తయ్యాయని, త్వరలోనే నగదు జమవుతుందని ఆర్‌బీకేల సిబ్బంది చెబుతూ వస్తున్నారు. ఉన్నతా ధికారులు వెంటనే స్పందించి ధాన్యం డబ్బులు తమ బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం జరుగుతున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, మార్చి 8 : పట్టణంలో శుక్రవారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద గల స్వామి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంపై ఏర్పాటు చేసి పురవీధుల గుండా నిదానందొడ్డిలోని కామాక్షిదేవి ఆలయం వరకు ఊరేగించారు. దారి పొడవున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు, అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, పట్టణ విశ్వబ్రాహ్మణసంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

పాయకరావుపేట రూరల్, మార్చి8: దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న కుమారపురం గ్రామానికి చెందిన రాయుడు తరుణ్ తల్లిదండ్రులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణ సాయం కింద రూ.లక్ష చెక్కును జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ చిక్కాల రామారావు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పన్నీరు పాపారావు, వైసీపీ నాయకులు నీలాపు బాలకృష్ణారెడ్డి, గెడ్డమూరి శ్రీనివాసరావు, యజ్జల అన్నవరం, వెంకట్, అప్పల రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి'


మునగపాకలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మునగపాక (తుమ్మపాల), మార్చి 8 : రానున్న ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పౌరులంతా సహకరించాలని ట్రైనీ డీఎస్పీ డి. భవ్యారెడ్డి పేర్కొన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా మండలంలోని మునగపాక, ఉమ్మలాడ, పల్లపు ఆనందపురం, గంటవానిపాలెం, చూచుకొండ, గణపర్తి తదితర గ్రామాల్లో పోలీస్ బలగాలు కవాతును నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ గఫూర్, ఎస్ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నూకతాత పండుగ ఏర్పాట్లు సీఐ పరిశీలన

నక్కపల్లి, మార్చి 8: మండలంలోని రాజయ్యపేటలో ఈనెల 9 నుంచి 10వ తేదీ వరకూ రెండు రోజులపాటు జరగనున్న నూకతాత పండుగకు ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం సీఐ విజయకుమార్ పరిశీలించారు. వాహనాల పార్కింగ్‌కు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఆదివారం గ్రామంలో పెద్ద ఎత్తున జాతర, నూకతాత ఘటాల ఊరేగింపు రాజయ్యపేట, బోయపాడు తీరాల్లో జరుగుతుంది. ఆదివారం సముద్రస్నానాలు చేస్తారని గ్రామ పెద్దలు చెప్పారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం


ఉపాధి కూలీలకు సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ శ్రేణులు

నక్కపల్లి, మార్చి 8: టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుతోనే గ్రామాలు, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నారు. శుక్రవారం రమణయ్యపేట, జి.జగన్నాథపురం గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిసి టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి అవగాహన కల్పించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని వంగలపూడి అనితను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గం లీగల్‌సెల్ అధ్యక్షుడు కర్రి ఆంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, నానేపల్లి రాఘవులు,రామకృష్ణ, పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పునఃప్రారంభించాలి

ఎస్.రాయవరం, మార్చి 8: మండలంలోని నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌లో నిలుపుదల చేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను వెంటనే పునఃప్రారంభించాలని శుక్రవారం సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు అనకాపల్లి ఎంపీ బీవీ సత్యవతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ రిజర్వేషన్ కౌంటర్‌ను నిలిపివేయడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను పునఃప్రారంభించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జి. శ్రీరామ్, ఎ.రాజు, సీపీఎం నాయకుడు సీహెచ్ శివాజీ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల పరుగు పోటీలు


ఎడ్ల బండ్ల పరుగు పందాలు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ గండి దేముడు తదితరులు

సబ్బవరం, మార్చి 8: మండలంలోని మొగలిపురం వీరాంజనేయస్వామి తీర్థం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఎడ్ల బండ్ల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో 15 ఎడ్ల బండ్లు పాల్గొన్నాయి. ఈ పోటీలను మాజీ ఎంపీపీగండి దేముడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గండి రవికుమార్, బోను నాయుడు తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. మొదటి స్థానంలో నెక్కలపాలెంకు చెందిన పైడితల్లమ్మ బండి, ద్వితీయ స్థానంలో అర్జునగిరికి చెందిన పరవాడ నాయుడు బండి, కేసీటీ పట్నంకు చెందిన చిరికి దుర్గాప్రసాద్ బండి తృతీయ స్థానంలో నిలిచాయి. వీరికి నిర్వాహకులు రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు అందజేశారు. తరువాత ఐదు స్థానాల్లో నిలిచిన నెక్కలివానిపాలెంకు చెందిన వెంకట కోమలి, లక్కవరానికి చెందిన నేమాలి నరేష్, కేసీటీ పట్నంకు చెందిన ఓబుల్‌రెడ్డి మోహన్, వాయులుపాడుకు చెందిన గండి వెంకటరావు బండ్లుకు కూడా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తమరాన బంగారునాయుడు, గండి ముత్యాలనాయుడు, బైలపూడి సత్యం తదితరులు పాల్గొన్నారు.


మాడుగుల శివాలయంలో అర్చకులు శివారాధన


రోలుగుంట శివాలయంలో 108 లింగాలకు పూజలు చేస్తున్న భక్తులు


చీడికాడ శివాలయంలో మహిళల పూజలు


శివశివ శంకర..భక్తవ శంకర..

- అత్యంత భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తజనం
- వేకువజాము నుంచి విశేష పూజలు
- పలుచోట్ల రిజర్వాయర్లు, నదుల్లో స్నానాలు


చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయంలో అభిషేకాలు



గొలుగొండ మండలం ధారమఠంలో స్వామికి పూజలు, జలపాతంలో స్నానాలు చేసేందుకు వెళుతున్న భక్తులు


నాతవరం మండలం బుచ్చింపేటలో లింగాకారానికి విద్యుద్దీపాలంకరణ



నర్సీపట్నం ఉత్తరవాహినిలో స్నానాలు చేస్తున్న భక్తులు.., బ్రహ్మలింగేశ్వరస్వామికి హారతులు ఇస్తున్న దృశ్యం

నర్సీపట్నం, మార్చి 8 : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం శైవక్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. ఇందులో భాగంగా నర్సీపట్నంలోని పెద్ద చెరువు సమీపంలో గల కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, బలిఘట్టంలోని బ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయం, పెదబొడ్డేపల్లి తదితర ప్రాంతాల్లో శివాలయాల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. నర్సీపట్నం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బలిఘట్టం ఉత్తర వాహినిలో పుణ్య స్నానాలు చేసి అర్చకులు, బుడగ జంగాలతో పలువురు పితృ దేవతలకు పూజలు చేశారు. అనంతరం త్రిశూల పర్వత శ్రేణిపై కొలువుదీరిన బ్రహ్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే గణేశ్ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇదిలావుంటే, పాకలపాటి గురుదేవుల ఆశ్రమంలో కూడా రమణ మాస్టారు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మహా శివరాత్రిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా ఉత్తరాంధ్రలో పేరెన్నికగన్న పాతమల్లంపేటలోని ధారమఠం ఉమాధార మల్లేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తొలుత ఇక్కడి జలపాతంలో స్నానాలు ఆచరించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. నర్సీపట్నం ఆర్టీసీ డిపో నుంచి పదిహేను బస్సులు ఏర్పాటు చేశారు. అలాగే, గొలుగొండ, జోగంపేట, పప్పుశెట్టిపాలెం, కొత్తమల్లంపేట, పాతమల్లంపేట, నర్సీపట్నం పరిసర ప్రాంతాలల్లోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఇదిలావుంటే, ఏఎల్‌పురం శివారులోని బొడ్డేరు గెడ్డను అనుకొని ఉన్న అతిపురాతన నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు.

నాతవరం : మండలంలోని చమ్మచింత, బుచ్చింపేట, వీరభూపతి అగ్రహారం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. చమ్మచింత ఉత్తరవాహిని వద్ద గల తాండవ నదిలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి, ఇక్కడ కొలువుదీరిన కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే పురాతన వీరభూపతి అగ్రహారంలో ఉన్న రామాలింగేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు.

మాకవరపాలెం : శివరాత్రి పర్వదినాన్ని భక్తులంతా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పైడిపాల వామలింగేశ్వర దేవాలయం , గిడుతూరులోని గంగాధర శివాలయం, పీపీ అగ్రహారంలోని మక్తేశ్వర ఆయాలకు భక్తులు పోటెత్తారు. అలాగే, మండలంలోని అన్ని గ్రామాల్లో గల శివాలయాల్లో అభిషేకాలు జరిపారు.

చోడవరం : మహాశివరాత్రిని మండలవాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా చోడవరం పట్టణంలోని ప్రముఖ స్వయంభూ గౌరీశ్వరాలయం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ, ఆలయ కమిటీ ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టారు. ఆలయం వద్ద రిటైర్డ్ ఎంపీడీవో నాగరాజు పేదలు, ఆలయంలో పని చేసే వారికి లుంగీలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. అలాగే, ముద్దుర్తి, జుత్తాడ, గవరవరం తదితర గ్రామాల్లోని ఆలయాల్లోనూ విశేష పూజలు జరిపారు. ఇదిలావుంటే, రాయపురాజుపేటలోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో స్వామివారికి 108 బిందెలతో జలాభిషేకం చేశారు.

బుచ్చెయ్యపేట : మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలకు పోటెత్తారు. వడ్డాది, కొత్తూరు, మంగళాపురం, విజయరామరాజుపేట, బంగారుమెట్ట, దిబ్బిడి, రాజాం, పెదపూడి, పొట్టిదొరపాలెంగ్రామాల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పి.భీమవరం రోడ్డులో, వడ్డాది కొత్తూరులో గల భీమలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద అన్నసమారాధన జరిపారు. నాయకులు బత్తుల తాతయ్యబాబు, కేవీఎస్‌ఎన్ రాజు, మల్లునాయుడు పూజల్లో పాల్గొన్నారు.

రోలుగుంట : శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. రోలుగుంటలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జానకిరాంపురం శివాలయం, బుచ్చెంపేట మినీ కైలాసగిరిలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. అలాగే పలు గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

మాడుగుల/ మాడుగుల రూరల్ : మహా శివరాత్రి పర్వదినాన్ని మండలవాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మాడుగులలోని భీమలింగేశ్వర, స్వర్ణలింగేశ్వర, ఉబ్బలింగేశ్వర, కృష్ణ భూపాలేశ్వర, శివగంగ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అలాగే, గ్రామ గ్రామాన ఉన్న శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఎం.కోడూరు కాశీవిశ్వేశ్వర ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. వీరవిల్లి అగ్రహారంలోని ఉమా భీమలింగేశ్వర ఆలయం, ఎం.కోడూరు కాశీవిశ్వేశ్వరాలయం, జంపెన గుప్త లింగేశ్వరాలయం, జాలంపల్లి, కేజేపురంలలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఫొటోరైటప్:

కె.కోటపాడు : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కె.కోటపాడు, చౌడువాడ, గొండుపాలెం, మేడిచర్ల, ఎ.కోడూరు, ఆనందపురం, కింతాడ, లంకవానిపాలెం, చంద్రయ్యపేటలోని బాటమల్లన్నతో పాటు స్వయం భూగా వెలిసిన ఆర్లి శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

దేవరాపల్లి : మండలంలోని శివాలయాలు మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కోలాహలంగా మారాయి. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. దేవరాపల్లితో పాటు వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో స్వామి దర్శనాలకు భక్తులు క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. పలు ఆలయాల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తదితరులు ప్రత్యేక పూజల జరిపారు.

చీడికాడ : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి స్వామివారికి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. చీడికాడ, ఖండివరం, ఎల్‌బీపట్నం, తురువోలు, పెదగోగాడ, బి.సింగవరం తదితన గ్రామాల్లోని ఆలయాల్లో దర్శనాలకు బారులు తీరారు.

వడ్డాది వెంకన్న కల్యాణానికి రాట


రాటోత్సవంలో దొండా కన్నబాబు తదితరులు

బుచ్చెయ్యపేట, మార్చి 8 : వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువుదీరిన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 151 వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆలయం వద్ద ముహూర్తపు రాటను వేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొండా కన్నబాబు, శ్రీరామూర్తిలతో అర్చకులు శ్రీకాంత్ ఆచార్యులు శాస్త్రోక్తంగా ఈ వేడుకను జరిపించారు. ఈ నెల 19న అంకురార్పణ, ధ్వజారోహణ (దొండ పెండ్లి), 20న స్వామివారి కల్యాణం, 21, 22, 23 తేదీల్లో హోమాధికాలు, తిరువీధి ఉత్సవం, 24న పూర్ణాహుతి, చక్రస్నానం, నాగవల్లి వసంతోత్సవం, 25న పవళింపు (పుష్పాంజలి) సేవతో వార్షిక కల్యాణోత్సవాలు ముగుస్తాయని కన్నబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఈవో టీఎస్‌ఎస్ శర్మ, దొండా గోదావరిబాబు, సన్యాసిరావు, వీర్ల సురేష్, అడపా నర్సింహమూర్తి, పొలిమేర కృష్ణలతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కక్షపూరితంగానే జనసేన నేతల ఇళ్లలో సోదా

గొలుగొండ, మార్చి 8 : జనసేన నాయకుల ఇళ్లలో పోలీసులు కక్షపూరితంగా సోదాలు నిర్వహిస్తుండడం తగదని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర ఆరోపించారు. గొలుగొండలో శుక్రవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. మంగళగిరిలోని అపార్టుమెంట్లలో ఉంటున్న పార్టీ శ్రేణుల ఇళ్లలో తనిఖీలు చేస్తూ భయాందోళనకు గురిచేయడం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసే ఇటువంటి దుశ్చర్యలకు తమ పార్టీ వారు భయపడేది లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఓటమి తథ్యమని స్పష్టం చేశారు. నాయకులు గండెం దొరబాబు, కోన నారాయణరావు, సూరిశెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.

'బలహీన వర్గాలకు అండగా న్యాయస్థానాలు'

రోలుగుంట, మార్చి 8 : న్యాయస్థానాల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు అన్నారు. స్థానిక ఎన్జీవో హోంలో శుక్రవారం ఏర్పాటైన వివిధ దళిత సంఘాల ఐక్య వేదిక జోనల్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. బడుగు, బలహీనవర్గాలకు న్యాయస్థానాలు అండగా నిలుస్తున్నాయన్నారు. ప్రొఫెసర్ సాయిబాబాను అన్యాయంగా అరెస్టు చేస్తే కోర్టు ద్వారా న్యాయం జరిగిందన్నారు. కోడికత్తి కేసులో జనపల్లి శ్రీనివాసరావును బయటకు తీసుకురావడానికి విదసం ఐక్యవేదిక ఎంతో కృషి చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వడ్లమూరి దేవుళ్లు, గోవింద్, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో వీహెచ్‌పీ కమిటీలు


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

మాడుగుల రూరల్, మార్చి 8 : విశ్వహిందూ పరిషత్ కమిటీలను ప్రతి గ్రామంలో వేయనున్నట్టు పరిషత్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ తెలిపారు. కేజేపురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం పలు గ్రామాల్లోని సభ్యులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ప్రతి గ్రామంలో ఔత్సాహికులతో కమిటీలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దా సీతారామ్, వీహెచ్‌పీ మాడుగుల మండల అధ్యక్షుడు రాపేటి రామకొండారావు, ప్రధాన కార్యదర్శి కొండలరావు, సభ్యులు రామునాయుడు, శ్రీనివాస్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రశాంత ఎన్నికలకు సహకరించండి'


కొత్తమల్లంపేటలో మాట్లాడుతున్న ఎస్‌ఐ కృష్ణారావు

గొలుగొండ, మార్చి 8 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేలా సహకరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్‌ఐ కృష్ణారావు అన్నారు. మండలంలోని కొత్తమల్లంపేటలో శుక్రవారం గ్రామస్థులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల వేళ చిన్నచిన్న తగాదాలకు అంతా దూరంగా ఉండాలన్నారు. పార్టీలు ఎటువంటి ప్రలోభాలకు గురిచేసిన లొంగకుండా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందిగా సూచించారు. స్థానిక నాయకులు చిటికెల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం


మహిళా ప్రజాప్రతినిధుల సన్మానోత్సవంలో ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నర్సీపట్నంలోని పెదబొడ్డేపల్లి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ మహిళా ప్రజాప్రతినిధులను సన్మానించారు. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, కర్రి వీఎస్‌ఎల్‌వీ చైతన్య, యాదగిరి మణి, బేతిరెడ్డి రత్నం, చెక్క బాలమ్మ, కో-ఆప్షన్ సభ్యురాలు షేక్ రోజాతో పాటు వివిధ నామినేటెడ్ పదవులలో ఉన్న మహిళలకు దుశ్శాలువాలు కప్పి సన్మానించారు.

చోడవరం : మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీవిముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ ఓవీఎస్ లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం ఇక్కడి అంబేడ్కర్ భవనంలో సమావేశం ఏర్పాటైంది. జనసాహితీ రచయిత రవిశంకర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.గౌరీశంకర్, లక్ష్మీకుమారి, నవయువ సమాఖ్య జిల్లా కన్వీనర్ భాస్కర్, ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ రమణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఇదిలావుంటే, చోడవరం మహిళా పరస్పర సహకార పొదుపు పరపతి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఎంపీపీ గాడి కాసు, ఎంఈవో జయలక్ష్మి, న్యాయవాది రజని, మాజీ ఉప సర్పంచ్ బగ్గు శ్యామల, సంఘం అధ్యక్షురాలు ఎల్.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని చీడికాడ మండలంలోని ముగ్గురు గ్రామీణ ఉద్యోగులను ఉత్తమ సేవకులుగా జిల్లా అధికారులు ఎంపిక చేశారు. వీరిలో ఐసీడీఎస్ చినగోగాడ క్లస్టర్ సూపర్‌వైజర్ వై.ఈశ్వరమ్మ, బైలపూడి అంగన్‌వాడీ టీచర్ కె.అన్నపూర్ణ, కోనాం మహిళా పోలీస్ రొంగలి రమాదేవి ఉన్నారు. ఈ ముగ్గురూ ఎంపీ సత్యవతి చేతులమీదుగా శుక్రవారం అనకాపల్లిలో అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ చిన్మయాదేవి, పీడీ అనంతలక్ష్మి, మాడుగుల ఐసీడీఎస్ పీవో సిహెచ్.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చేతులు కలిపిన ఉద్దండులు!

... 5వ పేజీ తరువాయి

ఓటమిపాలయ్యారు. కొంతకాలం తరువాత వైసీపీ అధినేత తీరు నచ్చక ఇద్దరూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేశారు. టీడీపీలో చేరాలని భావించినప్పటికీ అనివార్య కారణాల వల్ల చేరలేదని రాజకీయ వర్గాల సమాచారం. దాదాపు నాలుగేళ్లపాటు రాజకీయంగా స్తబ్దుగా వున్నారు. గత ఎన్నికల ముందు దాడి వీరభద్రరావు మళ్లీ వైసీపీలో చేరారు. కొణతాల రామకృష్ణ తటస్థంగానే ఉన్నారు. అయితే అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ఆడారి ఆనందకుమార్‌తోపాటు టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా కొన్నిచోట్ల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ అధికా రంలోకి వచ్చినప్పటికీ దాడి వీరభద్రరావు కుటుంబానికి తగిన న్యాయం జరగలేదు. దీంతో ఇటీవల తన కుమారులు రత్నాకర్, జయవీర్‌లతో కలిసి దాడి వీరభద్రరావు టీడీపీలో చేరారు. ఇది జరిగిన కొద్ది రోజులకే కొణతాల రామకృష్ణ జనసేన పార్టీలో చేరారు. తరువాత టీడీపీ-జనసేన కూటమి పొత్తులో భాగంగా అనకాపల్లి సీటును జనసేనకు కేటాయించడంతో, కొణతాల రామకృష్ణను అభ్యర్థిగా ప్రకటించడం ఒకేసారి జరిగిపోయాయి. దీంతో దశాబ్దాల కాలంగా వున్న రాజకీయ వైరాన్ని పక్కన పెట్టి కొణతాల రామకృష్ణ శుక్రవారం దాడి వీరభద్రరావు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. సుదీర్ఘ కాలంపాటు రాజకీయ ప్రత్యర్థులుగా వున్న ఇద్దరు ఉద్దండులు చేతులు కలపడంతో వచ్చే ఎన్నికల్లో అనకాపల్లితోపాటు పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణాలు మారతాయని విశ్లేషకులు అంటున్నారు.

తప్పుడు వాగ్దానాలతో జగన్ మోసం

- కేంద్ర ప్రభుత్వ పథకాలకు సొంత స్టిక్కర్లు ఎందుకు..?
- ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులతో వేధింపులు
- మన్యపురట్ల ఎన్నికల శంఖారావ సభలో మాజీ మంత్రి అయ్యన్న



మన్యపురట్లలో అయ్యన్నకు హారతి ఇస్తున్న మహిళలు

నాతవరం, మార్చి 8 : కేంద్ర పథకాలకు జగన్ స్టిక్కర్లు ఎందుకని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. వ్యాన్‌లపై జగన్ బొమ్మలు వేయించుకుని కేంద్రప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని తానే ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటుండడం విడ్డూరంగా ఉందన్నారు. మండలంలోని మన్యపురట్లలో శుక్రవారం రాత్రి నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు సన్నబియ్యం ఇస్తానని చెప్పి జగన్ ప్రజలను మోసం చేశారని పేర్కొన్నారు. 22 మంది ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా, రైల్వే జోన్ తెస్తానని చెప్పి, నేడు ప్రత్యేక హోదా ఊసే లేకుండా చేశారని మండిపడ్డారు. తాను, రాజశేఖరరెడ్డి ఎంపీలుగా ఉన్నప్పుడు ఢిల్లీలో పార్లమెంట్‌కు కలిసి వెళ్లేవారమన్నారు. పార్టీ వేరైనా ఒకరినొకరు గౌరవించే సాంప్రదాయం నాడు ఉం డేదన్నారు. నేడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజా సమస్యలపై ప్రశ్నించే తనలాంటి వారిని శత్రువుగా చూస్తూ- అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. తనపై 16 అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారన్నారు. మద్యం అధిక ధరలకు అమ్ముతూ సామాన్యులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. పట్టాదారు పాసు పుస్తకాలపైన, సర్వేరాళ్లపైన జగన్ ఫొటోలు ముద్రించడం ఏమిటని ప్రశ్నించారు. జగన్ అసమర్థ పాలన వలన రాష్ట్రం సర్వనాశం అయ్యిందని వాపోయారు. జగన్‌కు బటన్ నొక్కడం తప్పితే, పాలన చేతకావడం లేదన్నారు. సీపీఎస్ రద్దు చేస్తానని టీచర్లను మోసం చేశారన్నారు. అంతకుముందు నాయకులతో కలిసి అయ్యన్న గ్రామంలో పర్యటించగా, మహిళలు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. టీడీపీ అధికారంలోకి వస్తే మండలంలోని ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని వారికి అయ్యన్న హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్య క్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణ, నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కొండబాబు, మాజీ ఎంపీపీ ఎన్.విజయ్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ వీసం చిట్టిబాబు, మన్యపురట్ల మాజీ సర్పంచ్‌లు వనిమిన సూర్యారావు, వీసం నూకరాజు, రామలింగేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ అప్పన్న, దివాణం తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు గ్రామస్థులు పాల్గొన్నారు.

'కలలకు రెక్కలు'తో మహిళల విద్యకు ప్రాధాన్యం


కె.కోటపాడులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పీవీజీ కుమార్

కె.కోటపాడు, మార్చి 8 : మహిళా సాధికారతకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ముందడుగు వేశారని టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. 'కలలకు రెక్కలు' పేరుతో ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకు వస్తామని ప్రకటించడం ఆనందదాయకమన్నారు. శుక్రవారం కె.కోటపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ఆడ బిడ్డ డబ్బులు లేక చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతోనే ఈ పథకాన్ని పెట్టనున్నట్టు చెప్పారు. ఇంటర్ పూర్తి చేసిన మహిళలు ఈ పథకానికి దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. టీడీపీ నాయకులు కసిరెడ్డి అప్పలనాయుడు, కన్నూరు సూర్యనారాయణ, లెక్కల మల్లేశ్వరరావు, మాజీ ఎంపీపీ సబ్బవరపు రామానాయుడు, మాజీ సర్పంచ్‌లు బత్తి రమణ, రొంగలి అప్పలనాయుడు, జూరెడ్డి రాము, లెక్కల అవతారమూర్తి, రాళ్లపల్లి శ్రీరామ్మూర్తి, అక్కున్నపాత్రుడు పాల్గొన్నారు.


పథకం వివరాలు వెల్లడిస్తున్న నీలవేణి

రావికమతం : మహిళా వికాసానికి టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారని టీడీపీ చోడవరం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి తెలిపారు. కొత్తకోటలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళల విద్యకు కలల రెక్కలు అనే పేరుతో సరికొత్త పథకాన్ని రూపొందించనున్నట్టు చంద్రబాబు ప్రకటించడం ఆనందదాయకమన్నారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దేవుళ్లమ్మ పేరంటాల తీర్థం


ఎడ్ల బండ్ల పరుగు పోటీలో విజేతకు నగదు బహుమతి అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి, మార్చి 8 : మండల కేంద్రం దేవరాపల్లిలోని ఒడ్డు చింతల కళ్లాలు, తగరంపూడి కళ్లాల్లో దేవుళ్లమ్మ పేరంటాల తీర్థాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఎడ్ల బండ్ల పరుగు పోటీలను నిర్వహించి విజేతలకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ద్వారా నగదు బహుమతులను అందజేశారు. తొలుత దేవుళ్లమ్మ పేరంటాలతో పాటు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద జరిగిన పూజా కార్యక్రమాలకు బూడి హాజరై దర్శించుకున్నారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వి.సింహాచలంనాయుడు, మొల్లి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల : పట్టణ శివారు మామిడివారి కళ్లాల వద్ద శుక్రవారం పోతురాజుబాబు తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

'బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల స్థలాన్ని కాపాడండి'

నర్సీపట్నం, మార్చి 8 : పట్టణం నడిబొడ్డున చెక్కావారి బంకు ఎదురుగా మెయిన్ రోడ్డును ఆనుకొని ఉన్న బ్రిటీష్ సైనికాధికారుల సమాధుల స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని పన్ను చెల్లింపుదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి కె.శివనారాయణరాజు శుక్రవారం మునిసిపల్ కమిషనర్ రవిబాబును కోరారు. కోట్లాది రూపాయలు విలువ చేసే ఈ స్థలాన్ని ఇప్పటికే చాలా మంది ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మరికొంత మంది ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

ధాన్యం డబ్బులకు ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

, పొట్టిదొరపాలెం ఆర్‌బీకే నుంచి 41 టన్నులు... మొత్తం 91 మంది రైతుల నుంచి 230 టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు చేశారు. వీటిని సంబంధిత రైస్ మిల్లులకు సరఫరా చేశారు. వీరిలో ఎక్కువ మంది రైతులు జనవరిలోనే ధాన్యం విక్రయించారు. మూడు వారాల్లో డబ్బులు జమ అవుతాయని చెప్పిన అధికారులు... రెండు నెలలు దాటినా పట్టించుకోవడంలేదు. ఈ మూడు ఆర్‌బీకేల ద్వారా ధాన్యం విక్రయించిన రైతులకు సుమారు రూ.50 లక్షలు అందాల్సి వుందని చెబుతున్నారు. ధాన్యం డబ్బుల కోసం ఆర్‌బీకేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని రైతులు వాపోతున్నారు. ఆన్‌లైన్ పనులన్నీ పూర్తయ్యాయని, త్వరలోనే నగదు జమవుతుందని ఆర్‌బీకేల సిబ్బంది చెబుతూ వస్తున్నారు. ఉన్నతా ధికారులు వెంటనే స్పందించి ధాన్యం డబ్బులు తమ బ్యాంకు ఖాతాలకు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.